# ప్రతిభ


ద్వైమాసిక పత్రిక (సెప్టెంబర్, అక్టోబర్)

సంచిక-2



## తెలుగు శాఖ

## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్




కాళోజీ నారాయణరావు గారు


**దేశభాషలందు తెలుగు లెస్స**



గుఱ్ఱం జాషువా గారు



కవిసామ్రాట్
విశ్వనాథ సత్యనారాయణ గారు



చేకూరి రామారావు (చేరా) గారు

ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక

**-కాళోజీ**

# ప్రతిభ

## ద్వైమాసిక పత్రిక (సెప్టెంబర్, అక్టోబర్)

**గౌరవ సంపాదకులు:**
డా. జి సుకన్య గారు,
ప్రధానాచార్యులు
**ప్రధాన సంపాదకులు:**
డా.జె. భారతి,
తెలుగు శాఖ అధ్యక్షులు
**సంపాదక సహకారం:**
తెలుగు శాఖ అధ్యాపకులు
మరియు
కళాశాల తెలుగు సంఘం విద్యార్థులు



కళాశాల వ్యవస్థాపకులు
ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు

**లోపలి పుటల్లో...**

ఆలోచన...3
ముఖచిత్ర పరిచయం...4
పోటీ పరీక్షలకు తెలుగు...5
పదకేళి...9
విద్యార్థుల రచనలు...10
సాహిత్య రత్నాలు...17
ఉపాధ్యాయ దినోత్సవం...25
బతుకమ్మ పండుగ...26
మీకు తెలుసా!...28
ఓ మంచి పద్యం...30
పదవినోదం...31
కళాశాల వార్తా కదంబం...32

నూరు పువ్వులు వికసించనీ వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ

# ఆలోకన

**ఆచార్యాత్ పాదమాత్ దత్తే, పాదమ్ శిష్య స్వమేథయా|**
**పాదమ్ సబ్రహ్మచారిభ్య: పాదమ్ కాలక్రమేణచ||**

విద్యార్థి జ్ఞానార్జనా విధాన్ని తెలియచెపుతున్న సుభాషిత శ్లోకం ఇది.


విద్యార్థి జ్ఞానవంతుడైన వ్యక్తిగా ఎదిగే క్రమంలో ఒక వంతు జ్ఞానాన్ని గురువుల వద్ద నుండి, మరొకవంతు జ్ఞానాన్ని స్వంత మేధా శక్తి ద్వారా మరొకవంతు తోటి విద్యార్థులు, మిత్రుల వలన పొందుతాడు. ఇలా పొందిన జ్ఞానానికి కాలక్రమేణా జీవితానుభవం చేరుతూ ఉండటంతో జ్ఞానవంతుడైన వ్యక్తిగా ఎదుగుతూ ఉంటాడు. ఈ విధంగా జ్ఞానసాధన నిరంతరం జరిగేది అని గ్రహించిన వారు నాకు తెలుసు అన్న అహంకార ధోరణిని మనసులోకి రానివ్వకుండా విద్యాభ్యాసం అనేది కళాశాల స్థాయి వరకే పరిమితం కాదనే విషయాన్ని గుర్తించి నిత్య విద్యార్థిగా మసులుకోవాలి.

సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు చెందిన విశేషాలతో వెలువడుతున్న ఈ సంచిక ఉపాధ్యాయ దినోత్సవం, బతుకమ్మ పండుగ వంటి విశేషాలను అందిస్తూ ఈ నెలలలో జన్మించిన కొందరు సాహితీ ప్రముఖులను మీకు పరిచయం చేస్తోంది. ఈ సంచిక నుండి పోటీ పరీక్షలకు ఉపయోగించే విధంగా తెలంగాణ ప్రాంతంలోని ఒక చారిత్రక కట్టడాన్ని చిత్రాలతో పాటు అందించే ప్రయత్నం చేస్తున్నాం.

పత్రికను అంతర్జాల మాధ్యమంలో విడుదల చేయటంలో తగిన రూపాన్ని ఇవ్వటానికి నిరంతరం శ్రమిస్తున్న మా పూర్వ విద్యార్థి చి. అభిలాష్ కి హార్థిక అభినందనలు తెలియజేస్తున్నాం.

**-ప్రధాన సంపాదకులు**

# ముఖచిత్ర పరిచయం




'ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్లకు కదలిక' అని ప్రేరేపించిన **కాళోజీ 1914 సెప్టెంబర్ 09** న జన్మించారు. ఈయన గురించిన మరిన్ని ఆసక్తికరమైన వివరాలు లోపలి పేజీల్లో తెలుసుకోండి



**1895 సెప్టెంబర్ 10** న జన్మించి, జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలుగు కవిగా ప్రసిద్ధి చెందిన కవిసామ్రాట్ **విశ్వనాథ సత్యనారాయణ** గారి జీవిత విశేషాలను లోపలి పుటల్లో తెలుసుకోండి.



కవికోకిల, నవయుగ చక్రవర్తిగా పిలుచుకునే **గుఱ్ఱం జాషువా గారు 1895 సెప్టెంబర్ 28 న** జన్మించారు. ఈయన గురించిన మరిన్ని జీవిత విశేషాలను లోపలి పేజీల్లో తెలుసుకోండి.



తెలుగు సాహిత్యంలో విమర్శకులుగా, భాషా శాస్త్రవేత్తగా ప్రసిద్ధి చెందిన **చేకూరి రామారావు గారు 1934 అక్టోబర్ 1 న** జన్మించారు. ఈయన గురించిన మరిన్ని జీవిత విశేషాలను లోపలి పేజీల్లో తెలుసుకోండి.

# పోటీ పరీక్షలకు తెలుగు ప్రశ్నావళి

పోటీ పరీక్షలను ఉద్దేశించి తయారుచేసిన తెలుగు సాహిత్య క్విజ్ లో పాల్గొని  కొత్త విషయాలను తెలుసుకోండి..!

**1. ప్రాఙ్నన్నయ  యుగం అంటే?**

అ) నన్నయకు పూర్వం

ఆ) నన్నయకు తర్వాత

ఇ) నన్నయ కాలం

ఈ) పదకొండో శతాబ్దం

**2. గాథాసప్తశతి కావ్యాన్ని రాసింది?**

అ) రాజరాజ నరేంద్రుడు

ఆ) ప్రోలయ వేమారెడ్డి

ఇ) హాలుడు

ఈ) రఘునాథ నాయకుడు

**3. నన్నయ అనువదించిన తెలుగు భారతం ఏ ప్రక్రియకు చెందింది?**

అ) పద్యకావ్యం

ఆ) చంపూ కావ్యం

ఇ) గద్యకావ్యం

ఈ) వచన కావ్యం

**4. కృష్ణద్వైపాయనముని ఎవరు?**

అ) కృష్ణుడు

ఆ) పరశురాముడు

ఇ) వ్యాసుడు

ఈ) వాల్మీకి

**5. నన్నయ యుగానికి గల మరోపేరు?**
అ) ప్రబంధయుగం
ఆ) కావ్యయుగం
ఇ) దక్షిణాంధ్ర యుగం
ఈ) అనువాద యుగం
**6. తెలుగు సాహిత్యంలో నన్నయ, తిక్కనల మధ్య కాలాన్ని ఏమంటారు?**
అ) శివకవి యుగం
ఆ) ప్రబంధ యుగం
ఇ) కావ్యయుగం
ఈ) ఆధునిక యుగం
**7. వికటకవిగా ప్రసిద్ధుడైన కవి ఎవరు?**
అ) తెనాలి రామకృష్ణుడు
ఆ) అల్లసాని పెద్దన
ఇ) నంది తిమ్మన
ఈ) ధూర్జటి
**8. పంచకావ్యాలలో ఒకటిగా పేరొందిన కావ్యం?**
అ) రాఘవపాండవీయం
ఆ) పారిజాతాపహరణం
ఇ) ప్రభావతీ ప్రద్యుమ్నం
ఈ) వసుచరిత్ర
**9. ఖండ కావ్య ప్రక్రియకు ఆద్యుడు ఎవరు?**
అ)కందుకూరి
ఆ)గురజాడ
ఇ)రాయప్రోలు
ఈ)చిలకమర్తి
**10. 'హిత సూచిని' ఏ ప్రక్రియకు సంబంధించింది?**
**అ**) ప్రహసనం
ఆ) వ్యాసం
ఇ) ఏకాంకిక
ఈ) కథ

**11. 'పురాణ వైర గ్రంథమాల' పేరుతో భారతీయ చరిత్రకు కొత్తరూపు కల్పించడానికి, కొన్ని చారిత్రక సత్యాలు వెలికి తీసే ప్రయత్నంగా నవలలు రాసి సంచలనం కలిగించిందెవరు?**

అ)చలం

ఆ) విశ్వనాథ సత్యనారాయణ

ఇ) బుచ్చిబాబు

ఈ) గోపీచంద్

**12. 'కుమార భారతి' బిరుదాంకితుడు?**

అ) పెద్దన

ఆ) తిమ్మన

ఇ) తెనాలి రామకృష్ణ

ఈ) సూరన

**13. కవి చౌడప్పను ఎవరి ఆస్థాన కవిగా పేర్కొంటారు?**

అ) విజయరాఘువ నాయకుడు

ఆ) రఘునాథ నాయకుడు

ఇ) శహాజీ

ఈ) కృష్ణాజీ

**14. తెలుగు జ్ఞాన్‌పీఠ్ పురస్కార గ్రహీతలు ఎందరు?**

అ) ఇద్దరు

ఆ) ముగ్గురు

ఇ) నలుగురు

ఈ) ఆరుగురు

**15. ఆంధ్రజ్యోతి దినపత్రికలో చేరాతలు పేరుతో ప్రచురితమైన వ్యాసాలు ఎవరివి?**

అ) చేకూరి రామారావు

ఆ) శ్రీ రంగం శ్రీనివాసరావు

ఇ) కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి

ఈ) గురజాడ అప్పారావు

**16. కన్యాశుల్కం నవలలోని అంకాల సంఖ్య?**

అ) 5

ఆ) 7

ఇ) 8

ఈ) 9

17. **ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ తొలి అధ్యక్షుడు?**

అ) ఎన్.గోపి

ఆ) రాయప్రోలు

ఇ) సినారె

ఈ) కసిరెడ్డి వెంకటరెడ్డి

18. **'కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట నుండనొల్లదు' అనే పద్యం ఏ శతకంలోనిది?**

అ) వేమన

ఆ) సుమతి

ఇ) దాశరథీ

ఈ) భాస్కర

19. **' భరత ఖండంబు చక్కని పాడియావు , హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ " అనే గీతాన్ని రచించింది ఎవరు ?**

అ ) గురజాడ అప్పారావు

ఆ ) కొమర్రాజు వెంకటలక్ష్మణరావు

ఇ ) ఉన్నవ లక్ష్మీనారాయణ

ఈ ) చిలకమర్తి లక్ష్మీనరసింహం

20. **మాలపల్లి నవలా రచయిత ఎవరు ?**

అ ) గురజాడ అప్పారావు

ఆ) శ్రీ శ్రీ

ఇ) ఉన్నవ లక్ష్మీనారాయణ

ఈ ) చిలకమర్తి లక్ష్మీనరసింహం

## సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-అ | 6-అ | 11-ఆ | 16-ఆ |
| 2-ఇ | 7-అ | 12-ఇ | 17-ఆ |
| 3-ఆ | 8-ఈ | 13-ఆ | 18-ఆ |
| 4-ఇ | 9-ఇ | 14-ఆ | 19-ఈ |
| 5-ఈ | 10-ఆ | 15-అ | 20-ఇ |

# పదకేళి

## తప్పొప్పులు

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

1. గాఢత( ) ఘూడత( )
2. పరకాష్ఠ ( ) పరాకాష్ఠ( )
3. ప్రత్యర్థి( ) ప్రత్యర్ధి ( )
4. అనాధ( ) అనాథ ( )
5. సమైక్య( ) సమైఖ్య ( )
6. ప్రస్తావన( ) ప్రస్థావన( )
7. సిబ్బంధి( ) సిబ్బంది( )
8. విశిష్ఠ( ) విశిష్ట ( )
9. నేపధ్యం( ) నేపథ్యం( )
10. పాటవం( ) పాఠవం( )

సమాధానాలు: తదుపరి పత్రికలో

**ప్రతిభ- ద్వైమాస పత్రిక (జులై. ఆగస్టు)**
**పదకేళి సమాధానాలు**

1. సామగ్రి
2. ప్రశ్నాపత్రం
3. మల్లికార్జున
4. ఆనందభాష్పాలు
5. బాధ
6. కథ
7. ఆశీస్సు
8. జెండా
9. ఉదహరించు
10. చేమంతి

# విద్యార్థుల రచనలు

# కవితలు

## ఆదర్శం

ఓడిపోవడం నాకు ఆదర్శం
ఓడిపోయినందుకు కాదు
గెలుపు అనే మార్గా న్ని చూపినందుకు.

## అద్భుతం

ఆహా ఆహా ఎంత అద్భుతంగా ఉందో
పువ్వు మీద తేనేటీగలు మకరందాన్ని గ్రహిస్తూ ఉంటే
ఎంత అద్భుతంగా ఉందో
మా గురువు గారు పాఠం చెబుతూ  ఉంటే
పిల్లలు ఎంత చక్కగా కూర్చున్నారో...

## మాటలు

మేకులై సూదులై బాణాలై
బాధించకూడదు
మాటలు
ఎదుటి వారి బాధల్ని భయాల్ని
పోగొట్టేలా ఉండాలి.

సపావట్ బాలు
బిఎస్సీ(ఎంపిసి) 3వ సంవత్సరం

# మాతృత్వం మరిచి...

గర్భ శోకాన్ని
గుండె శోకాన్ని
రెండింటినీ
సమానంగా భరించేది
ఆడపిల్ల ఒక్కరే.!!

ఈ దేశంలో
కూతుర్లను ప్రేమిస్తే చంపే
తల్లిదండ్రులున్నారు కానీ
కొడుకులు మానభంగాలు చేస్తే
చంపే తల్లిదండ్రులు
ఎందుకులేరు?

ఆడవాళ్ల ను చూడగానే
మాతృత్వం గుర్తుకొస్తే
స్త్రీ మానం.... మరో ప్రాణానికి
జన్మ
అని ఆలోచిస్తే
ఈ మానభంగాలు
అత్యాచారాలు ఉండవు

సపావట్ బాలు
బిఎస్సీ(ఎంపిసి) 3వ సంవత్సరం

# మనిషి జీవితం

మనిషి జీవితంలో
తాను బతికిన గొప్ప స్థానం
గర్భం లో ఉన్న తొమ్మిది నెలలు
ఎందుకంటే
అక్కడ ఏ మనిషి తప్పు చేయడు
ఎంత చీకటి ఉన్నా
భయం వేయదు
దేని మీద ఆశ ఉండదు
ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేది
కూడా
తల్లి గర్భంలో మాత్రమే
అందుకే మనిషి చూసిన గుడి
తల్లి గర్భం
మనిషి చూసిన దైవం
తల్లి ప్రేమ .

సపావట్ బాలు
బిఎస్సీ(ఎంపిసి) 3వ సంవత్సరం

# నా బాల్యం

మరుపురాని సన్నివేశాలు
మరువలేని అనుభూతులు
ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తుంది
నా బాల్యం
ఆడుకునే ఆటలు
మరువలేని స్నేహితులు
జీవితాన్ని బోధించిన గురువులు
మళ్ళీ రావాలనుకున్నా రాని రోజులు
ఇదే నా బాల్యం

# మా ఊరు

అందమైన మా ఊరు
పచ్చని పైరులకు పేరు
పారుతున్న ఏరు కల్లాపు చల్లిన వాకిళ్ళు
కల్మషం లేని మనుషులు స్
సుఖశాంతులకు మారుపేరు
ఇదేమా ఊరు

సిరిగిరి ఉమారాణి
బిఎస్సీ (ఎంపిసిఎస్) మూడవ సంవత్సరం

# రుబాయిలు

భూలోకం యివతల ఏముందో
పరలోకం అవతల ఏముందో
ఎవరు చేశారో తెలుసుకో
మనం ఉన్నది ఎందుకో తెలుసుకో 1

చెరువు ఖాళీగా ఉందని తెలుసుకున్నాము
వర్షపు నీటితో నిండుతాదని అనుకున్నాము
కళ్ళ నుంచి నీరు వస్తున్నాయి సావుకారి ఎక్కడ వస్తాడని
ఈ సృష్టి లో ఎలా బతకాలో తెలుసుకున్నాము 2

ఒకటి వెంట ఒకటి ఋతువులు వస్తాయి పోతాయి
ఒకరి వెంట ఒకరి పాలనలు వస్తాయి పోతాయి
చిరకాలం నిలిచేది జ్ఞానం ఒక్కటే
దోపిడీలు దొరతనాలు వస్తాయి పోతాయి 3 సపావట్ బాలు

బిఎస్సీ(ఎంపిసి) 3వ సంవత్సరం

---

రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్
బుర్రలు బుర్రలు పగులక లేదా సమస్యకు సొల్యూషన్
హింసా యుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను
శాంతి ఒక్కటే మానవజాతికి సాల్వేషన్ 1

పోరాటం ఒకటైనా వేరు వేరు గళాలు
పాలకులకు, పీడకులకు ఇవే అసలు బలాలు
అనాదిగా ఈ నేలను పీడిస్తూ ఉన్నవి
పీడితులను విడదీసే దౌర్భాగ్యపు కులాలు 2 వేణు

బీఎస్సీ మూడవ సంవత్సరం

# పొడుపు కథలు

1. అన్ని దేశాలకు ఇద్దరే రాజులు ఎవరు వారు?
2. ఎందరు ఎక్కిన విరగని మంచం ఏమిటది?
3. కోస్తే తెగదు కొడితే పలగదు ఏమిటది?

సమాధానాలు

1. సూర్యుడు, చంద్రుడు 2. భూమి 3. నీడ

సపావట్ బాలు
బిఎస్సీ(ఎంపిసి) 3వ సంవత్సరం

# చిత్రలేఖనం




NATURAL DISASTERS
VOLCANO
TSUNAMI
WILDFIRE
BLIZZARD
FLOOD
LANDSLIDE
TORNADO
MENAAZ ANJUM
B.SC (MPCS)
III YEAR.

# సాహిత్య రత్నాలు

తెలంగాణ భాషా దినోత్సవం - సెప్టెంబర్ 9

## కాళోజీ నారాయణరావు

## (1914-2002)



నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ **కాళోజీ నారాయణరావు** 1914 లో సెప్టెంబర్ 9న కర్నాటక బీజాపూర్‌లోని రట్టిహళ్లిలో జన్మించారు.

కాళోజీ అసలు పేరు **రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ.** ముద్దుగా ఈయనను కాళోజీ, కాళన్నా అని పిలుచుకునేవారు. తెలంగాణ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ కాళోజీ నారాయణరావు జయంతిని **తెలంగాణ భాషా దినోత్సవం**గా జరుపుకుంటున్నాము.

కర్నాటక నుంచి వరంగల్‌కు తరలివచ్చిన కాళోజీ కుటుంబం వరంగల్‌లో స్థిరపడింది. ప్రాథమిక విద్య, ఉన్నత విద్యను వరంగల్‌లోని మడికొండలో, హైదరాబాద్‌లో పూర్తిచేశారు. 1939 లో హైదరాబాద్‌లో న్యాయ విద్యను అభ్యసించారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల పట్ల ఆకర్శితులై ఆర్య సమాజ్, పౌర హక్కుల సాధన వంటి పలు ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆంధ్ర మహా సభ ప్రారంభమైనప్పటి నుంచి దాని కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. అలాగే, సత్యాగ్రహం, గ్రంథాలయ ఉద్యమంతోపాటు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన కాళోజీ.. పలు సార్లు జైలు జీవితం గడిపారు. పౌర హక్కుల సాధనలో క్రియాశీలకంగా ఉన్న ఆయన.. తుర్కుండె కమిటీలో సభ్యుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు మూడు సార్లు పోటీ చేసిన కాళోజీ.. ఒకసారి విజయం సాధించారు. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా.. అనంతర కాలంలో అధ్యక్షుడిగా ఎన్నికై సేవలందించారు.

కాళోజీ తెలుగు, ఉర్దూ హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో అనేక రచనలు చేసి ఖ్యాతి గడించారు. తన కవితల ద్వారా పేదలు, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన రాసిన 'నా గొడవ' సంకలనంలో సమకాలీన సామాజిక సమస్యలను ఎత్తి చూపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి సభ్యుడిగా కూడా సేవలందించారు. కాళోజీ సేవలకు గుర్తింపుగా కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా.. భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించింది. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలకు గౌరవంగా వైద్యవిశ్వవిద్యాలయానికి కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్సెస్ యూనివర్శిటీ అని పేరు పెట్టింది.

తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడబడిన ప్రజాకవి కాళోజీ 2002 నవంబరు 13న కన్నుమూశారు.

## రచనలు:

అణా కథలు, నా భారతదేశయాత్ర, పార్థివ వ్యయము, కాళోజి కథలు, నాగొడవ, జీవన గీత, తుదివిజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, ఇదీ నా గొడవ, బాపూ!బాపూ!!బాపూ!!!

### కాళోజీ ప్రసిద్ధ ఉల్లేఖనలు:

- *ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందరే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నే నెన్నో సార్లు చెప్పిన. భాష రెండు తీర్లు - ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల భాష. పలుకు బడుల భాషగావాలె. - కాళోజీ*
- తెలుగు బిడ్డవురోరి తెలుగు మాట్లాడుటకు-సంకోచ పడియెదవు సంగతేమిటిరా? అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు-సకిలించు ఆంధ్రుడా! చావవేటికిరా - కాళోజీ
- ఒక్క సిరాచుక్క లక్షల మెదళ్లకు కదలిక- కాళోజి
- పుట్టుక నీది-చావు నీది-బతుకంతా దేశానిదీ --- జయప్రకాశ్ నారాయణ మరణించినపుడు కాళోజి

# విశ్వనాథ సత్యనారాయణ

## (1895-1976)



**విశ్వనాథ సత్యనారాయణ "కవి సామ్రాట్"** బిరుదాంకితుడు. తెలుగు సాహిత్యంలో **తొలిజ్ఞానపీఠ అవార్డు గ్రహీత**. 20 వ శతాబ్దములోని ఆంధ్ర సాహిత్యానికి, ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యానికి పెద్ద దిక్కు విశ్వనాథ గారు. తెలుగు సాహిత్యంలో భావకవితా యుగానికి చెందిన ఈయన ఊహాప్రేయసి **కిన్నెరసాని**.

**జీవిత విశేషాలు:-**

విశ్వనాథ సత్యనారాయణ గారు కృష్ణా జిల్లా నందమూరు గ్రామం (నేటి ఉంగుటూరు మండలం)లో 1895 సెప్టెంబర్ 10న జన్మించారు. తండ్రి శోభనాద్రి, తల్లి పార్వతమ్మ. ఈయన భార్య వరలక్ష్మమ్మ. విద్యాభ్యాసము నందమూరు, ఇందుపల్లి, పెదపాడు గ్రామాల్లోను, పై చదువులు బందరు పట్టణంలోను సాగాయి. విశ్వనాథ గారికి బందరు హైస్కూలులో చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి తెలుగు ఉపాధ్యాయునిగా పరిచయం అయ్యారు. బి.ఎ. తరువాత విశ్వనాథ బందరు హైస్కూలులోనే ఉపాధ్యాయునిగా చేరారు. ఉద్యోగం చేస్తూనే మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఎ. పట్టా సాధించారు. తరువాత మహాత్మా గాంధీ నడుపుతున్న సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడం కోసం ఉద్యోగాన్ని వదులుకున్నారు. తరువాతి కాలంలో అనేక కళాశాలల్లో అధ్యాపక పదవులు నిర్వహించారు.

**సాహితీ ప్రస్థానం:-**

విశ్వనాథ గారు 1961 లో కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాలుగా పదవీ విరమణ చేసిన తరువాత పూర్తి స్థాయిలో తన సమయాన్ని సాహితీ వ్యాసాంగానికి కేటాయించారు. 1916 లో "విశ్వేశ్వర శతకము" తో విశ్వనాథ రచనా ప్రస్థానము ప్రారంభమైంది. అప్పటి జాతీయోద్యమ ప్రభావంతో ఆసమయంలోనే "ఆంధ్రపౌరుషము" రచించారు. 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయకావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శనా గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు రాశారు.

ఈయన రాసిన ప్రసిద్ధ "వేయిపడగలు" నవలను పి.వి. నరసింహారావు గారు "సహస్రఫణ్" పేరుతో హిందీలోకి అనువదించారు. విశ్వనాథ గారి "శ్రీమద్రామాయణ కల్పవృక్షం" గ్రంథానికి జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

విశ్వనాథ గారు రాసిన అనేక ప్రసిద్ధ రచనల్లో మచ్చుకు కొన్ని కింద ఇవ్వబడ్డాయి

**ప్రముఖ నవలలు**

- వేయిపడగలు
- స్వర్గానికి నిచ్చెనలు
- చెలియలికట్ట
- ఏకవీర
- తెఱచిరాజు
- మాబాబు
- జేబుదొంగలు
- వీరవల్లడు
- వల్లభమంత్రి
- విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు
- కిన్నెరసాని పాటలు
- కోకిలమ్మ పెండ్లి
- పాము పాట చిన్న కథలు

**ప్రముఖ నాటకాలు**

- అమృతశర్మిష్ఠమ్ (సంస్కృతం)
- గుప్తపాశుపతమ్ (సంస్కృతం)
- గుప్తపాశుపతము
- అంతా నాటకమే
- అనార్కలీ కావ్యవేద హరిశ్చంద్ర

**ప్రముఖ విమర్శలు**

- అల్లసానివారి అల్లిక జిగిబిగి
- ఒకనాడు నాచన సోమన్న
- కావ్య పరీమళము
- కావ్యానందము నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి
- విశ్వనాథ సాహిత్యోపన్యాసములు
- శాకుంతలము యొక్క అభిజ్ఞానత

**ప్రముఖ పద్యకావ్యాలు**

- శ్రీమద్రామాయణ
- ఆంధ్రప్రశస్తి
- ఆంధ్రపౌరుషము
- విశ్వనాథ మధ్యాక్కఱలు
- ఋతు సంహారము
- శ్రీకుమారాభ్యుదయము
- గిరికుమారుని ప్రేమగీతాలు

విశ్వనాథ తొలినాళ్ళలో వ్రాసిన గిరికుమారుని ప్రేమగీతాలు, కిన్నెరసాని పాటలు వంటి రచనల ద్వారా అతను భావకవుల్లో ముఖ్యునిగా పేరుపొందారు.`రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రిలతో పాటుగా విశ్వనాథ సత్యనారాయణ కూడా భావకవిత్వ రంగంలో ప్రముఖునిగా పేరొందారు. కథాంశం అత్యంత కీలకమని, కథను చెప్పడంలో వివిధ మలుపుల్లో అవసరమైనంత మేరకే ఏ చమత్కృతి అయినా రాణిస్తుందని భావించిన విశ్వనాథ గారు 1976 అక్టోబరు 18న పరమపదించారు.

# గుర్రం జాషువా

## (1895-1971)



ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన కవి **గుఱ్ఱం జాషువా.** సమకాలీన కవిత్వ ఒరవడి అయిన భావకవిత్వ రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేసారు. తక్కువ కులంగా భావించబడ్డ కులంలో జన్మించినందు వలన అనేక అవమానాలు ఎదుర్కొన్నారు. అయితే కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడి, ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారు.

జాషువా 1895 సెప్టెంబర్ 28న గుర్రం వీరయ్య, లింగమ్మ దంపతులకు ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా వినుకొండ మండలం చాట్రగడ్డపాడులో జన్మించారు. చిన్నతనం నుండి జాషువాలో సృజనాత్మక శక్తి ఉండేది. బొమ్మలు గీయడం, పాటలు పాడడం చేసేవారు. బాల్య స్నేహితుడు, తరువాతి కాలంలో రచయిత అయిన దీపాల పిచ్చయ్య శాస్త్రి సహచర్యంలో ఆయనకు కవిత్వంపై ఆసక్తి కలిగింది. జూపూడి హనుమచ్చాస్త్రి వద్ద మేఘసందేశం, రఘువంశం, కుమార సంభవం నేర్చుకున్నారు. జాషువా 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాసారు. వాటిలో ప్రముఖమైనవి:

**గబ్బిలం** (1941) ఆయన రచనల్లో సర్వోత్తమమైనది. కాళిదాసు మేఘసందేశం తరహాలో సాగుతుంది. అయితే ఇందులో సందేశాన్ని పంపేది యక్షుడు కాదు. ఒక అంటరాని కులానికి చెందిన కథానాయకుడు తన గోడును కాశీ విశ్వనాథునికి చేరవేయమని గబ్బిలంతో సందేశం పంపడమే దీని కథాంశం. ఎందుకంటే గుడిలోకి దళితునకు ప్రవేశం లేదు కాని గబ్బిలానికి అడ్డు లేదు. కథానాయకుడి వేదనను వర్ణించిన తీరు హృదయాలను కలచివేస్తుంది.

1932లో వచ్చిన **ఫిరదౌసి** మరొక ప్రధాన రచన. పర్షియన్ చక్రవర్తి ఘజనీ మొహమ్మద్ ఆస్థానంలో ఉన్న కవి ఫిరదౌసి. అతనికి రాజుగారు మాటకొక బంగారు నాణెం ఇస్తానని చెప్పగా ఆ కవి పది సంవత్సరాలు శ్రమించి మహాకావ్యాన్ని వ్రాశాడు. చివరకు అసూయాపరుల మాటలు విని రాజు తన మాట తప్పాడు. ఆవేదనతో ఆత్మహత్య చేసుకొన్న ఆ కవి హృదయాన్ని జాషువా అద్భుతంగా వర్ణించారు.
1948 లో రాసిన **బాపూజీ** - మహాత్మా గాంధీ మరణ వార్త విని ఆవేదనతో జాషువా సృష్టించిన స్మృత్యంజలి.


**ప్రముఖ రచనలు:**

- రుక్మిణీ కళ్యాణం
- చిదానంద ప్రభాతం
- కుశలవోపాఖ్యానం
- కోకిల
- ధ్రువ విజయం
- కృష్ణనాడి
- సంసార సాగరం
- శివాజీ ప్రబంధం
- వీరాబాయి
- క్రీస్తు చరిత్ర
- రాష్ట్ర పూజ,
- ముసాఫిరులు
- నాగార్జునసాగరం,
- నా కథ
- ఆంధ్ర భోజుడు
- గబ్బిలము
- కాందిశీకుడు
- తెరచాటు
- చిన్న నాయకుడు,
- నేతాజీ
- బాపూజీ,
- స్వయంవరం
- కొత్తలోకం

రాజు మరణించెనొక తార రాలిపోయె సుకవి మరణిమంచెనొక తార గగనమెక్కె
రాజు జీవించు రాతి విగ్రహముల యందు సుకవి జీవించు ప్రజల నాల్కల
యందు అని చాటిచెప్పిన జాషువా గారు 1971 జూలై 24న పరమపదించారు.

# చేకూరి రామారావు (చేరా)

## (1934-2014)



తెలుగు సాహిత్య ప్రపంచానికి విమర్శకులు, భాషా శాస్త్రవేత్తగా పిలువబడే డాక్టర్ **చేకూరి రామారావు** గారు 1934 అక్టోబర్ 1న ఖమ్మం జిల్లా ఇల్లెందులపాడులో జన్మించారు. చేరాగా అందరికి సుపరిచితులు. ఆధునిక భాషాశాస్త్ర రంగంలో కొత్త విప్లవాన్ని తీసుకువచ్చిన నోమ్ చామ్‌స్కీ పరివర్తన సిద్ధాంతాన్ని ఉపయోగించి తెలుగు వాక్యాన్ని విశ్లేషించి కొత్త ఒరవడికి ఆద్యులయ్యారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి ఎంఎ (తెలుగు) చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తూమాటి దోణప్ప గారి ప్రోత్సాహంతో భాషా శాస్త్రంలో ఎంఎ పట్టభద్రులయ్యారు. భాషావేత్త భద్రిరాజు కృష్ణమూర్తి ప్రోత్సాహంతో అమెరికాలోని కోర్నెల్ యూనివర్సిటీ నుంచి తెలుగు భాషా పరివర్తన సిద్ధాంతం ('ట్రాన్స్‌ఫర్మేషన్ థియరీ ఇన్ తెలుగు') అనే అంశంపై పిహెచ్‌డి పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషా శాస్త్రాధిపతిగా పనిచేస్తున్న కాలంలో డాక్టర్‌ద్వానా శాస్త్రి దగ్గర శిక్షణపొందారు.

ఆంధ్రజ్యోతి ఆదివారంలో చేరాతలు అన్న శీర్షిక నిర్వహించడం ద్వారా తెలుగు సాహిత్య విమర్శరంగంలోకి సుడిగాలిలా దూసుకువచ్చి, సంచలనం సృష్టించి ఒక కొత్త విమర్శ ధోరణిని ప్రవేశ పెట్టారు. ఈయన రాసిన స్మృతికిణాంకమనే వ్యాససంపుటికి 2002లో భారత ప్రభుత్వము కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును బహూకరించింది.

ఆధునిక విమర్శకులుగా ప్రపంచానికి పరిచయమైన చేరాగారు తన నివాసంలో ధ్యానం చేస్తుండగా 24 జూలై, 2014 రాత్రి గుండెపోటు వచ్చి మృతిచెందారు.

# చేరా ప్రసిద్ధ రచనలు:

1.1975 - తెలుగు వాక్యం
2.1978 - వచన పద్యం: లక్షణ చర్చ
3.1982 - రెండు పదుల పైన
4.1982 - తెలుగులో వెలుగులు (భాషా పరిశోధన వ్యాసాలు)
5.1991 - చేరాతలు సాహిత్య విమర్శ - పరామర్శ
6.1994 - చేరా పీఠికలు
7.1997 - ముత్యాల సరాల ముచ్చట్లు
8.1998 - ఇంగ్లీష్ తెలుగు పత్రికాపదకోశం
9.2000 - స్మృతికిణాంకం
10.2000 - భాషానువర్తనం
11.2001 - భాషాంతరంగం
12.2001 - సాహిత్య వ్యాస రించోళి
13.2001 - కవిత్వానుభవం
14.2002 - వచన రచన తత్త్వాన్వేషణ
15.2002 - సాహిత్య కిర్మీరం
16.2003 - భాషా పరివేషం

# ఉపాధ్యాయ దినోత్సవం – సెప్టెంబర్ 5



1888 - 1975

అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానజ్యోతి వెలిగించే ఉపాధ్యాయుల దినోత్సవాన్ని భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న జరుపుకుంటాం.

సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న తమిళనాడులోని తిరుత్తణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. ఇతను పాశ్చాత్య తత్వవేత్తలు ఎలా తమ భావనలను తమ సంస్కృతిలో అప్పటికే ఉన్న వేదాంత ప్రభావానికి ఎలా లోనవుతున్నారో చూపించారు. అతని దృష్టిలో తత్వం అనేది జీవితాన్ని అర్థం చేసుకోవటానికి ఒక మార్గం, భారతీయ తత్వాన్ని అర్థం చేసుకోవటం అనేది ఒక సాంస్కృతిక చికిత్సగా భావించారు. భారతీయ ఆలోచనా దృక్పథాన్ని పాశ్చాత్య పరిభాషలో చెప్పి, అందులో వివేకం, తర్కం ఇమిడి ఉన్నాయని చూపించి, భారతీయ తాత్వికచింతన ఏమాత్రం తక్కువ కాదని నిరూపించారు.

**ప్రముఖ రచనలు:**

- The Philosophy of Rabindranath Tagore (రవీంద్రుని తత్వం)
- The Reign of Religion in Contemporary Philosophy (సమకాలీన తత్వంపై మతం ఏలుబడి)
- Indian Philosophy (భారతీయ తత్వం) (2 సంపుటాలు)
- The Hindu View of Life (హిందూ జీవిత ధృక్కోణం)
- The Religion We Need (మనకు కావలిసిన మతం)

గొప్ప తాత్వికవేత్తగా, ఉత్తమ ఉపాధ్యాయుడుగా మార్గదర్శనం చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17 న పరమపదించారు.

# తెలంగాణ ప్రత్యేక పండుగ - బతుకమ్మ

*తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పండుగ బతుకమ్మను* ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఈ పండుగ దసరాకి రెండు రోజుల ముందు నుండి సద్దుల బతుకమ్మతో ప్రారంభం అవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.



## పండుగ వెనుక కథ:

పూర్వం భట్టు నరసింహ అనే భట్ట రాజులు చోళదేశాన్ని పాలించేవారు. ఆయన చాలా ధర్మాత్ముడు. అందువల్ల ధర్మాంగుడు అని కూడా పిలిచేవారు. అతని భార్య సత్యవతి. ఒక యుద్ధంలో ఆ రాజు తన బంధు మిత్రులను కోల్పోయి, భార్య సత్యవతితో అడవులకు వెళ్లిపోయాడు. ఆ తరువాత ఆయన శ్రీమహాలక్ష్మిదేవిని మనసున తలచి, గొప్ప తపస్సు చేసాడు. కొంత కాలానికి శ్రీమహాలక్ష్మీదేవి కరుణించి, సాక్షాత్కరించి ఏమి వరం కావాలని అడిగింది. తల్లీ! మమ్ములను కరుణించి, నీవే మా కుమార్తెగా జన్మించాల'ని ఆయన వేడుకున్నాడు. అందుకు శ్రీమహాలక్ష్మీదేవి సంతోషించి, తథాస్తు అన్నది. కొంత కాలానికి సత్యవతి గర్భాన శ్రీమహాలక్ష్మీదేవి జన్మించింది. ఆ బాలికను చూసి మునులు, ఋషులు ఎంతో సంతోషించి, అనారోగ్యాలు లేకుండా బాగా ' బతుకమ్మా అని దీవించారు. ఆనాటి నుంచి ఆమెను బతుకమ్మగా పిలువసాగారు. బతుకమ్మ జన్మించిన కొంతకాలానికే రాజు తిరిగి తన రాజ్యాన్ని సంపాదించి, రాజ్యమేలాడు. ఆ రాజ్య ప్రజలు సుఖసంతోషాలతో ఎంతో ఆనందంగా జీవించారు.

తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ ఓక్కో రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. చివరిరోజు సద్దుల బతుకమ్మ అంటారు. ఈ రోజు మాత్రం నైవేద్యాన్ని మహిళలు తయారు చేస్తారు.

**మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ:** మహా అమవాస్యరోజు బతుకమ్మ మొదటిరోజు వేడుక మొదలవుతుంది. తెలంగాణలో దీన్ని పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యంపిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

**రెండవరోజు అటుకుల బతుకమ్మ :** ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

**మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మ :** ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

**నాల్గవరోజు నానే బియ్యం బతుకమ్మ :** నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేస్తారు.

**ఐదవరోజు అట్ల బతుకమ్మ :** అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

**ఆరవరోజు అలిగిన బతుకమ్మ :** ఈరోజు ఆశ్వయుజ పంచమి. నైవేద్యమేమి సమర్పించరు.

**ఏడవరోజు వేపకాయల బతుకమ్మ :** బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

**ఎనిమిదవరోజు వెన్నముద్దల బతుకమ్మ :** నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

**తొమ్మిదవరోజు సద్దుల బతుకమ్మ :** ఆశ్వయుజ అష్టమి నాడు ఆదేరోజు దుర్గాష్టమిని జరుపుకుంటారు. ఈ రోజుతో తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగ ముగుస్తుంది.

# ద్వ్యర్థి కావ్యం

తెలుగుసాహిత్యంలో ద్విపద, ప్రబంధము, శతకము, యక్షగానము మొదలైన ప్రక్రియల్లాగే అనేక అర్థాలు వచ్చే కావ్యాలు కూడ వచ్చాయి. రెండర్థాలు వచ్చే కావ్యాలు ద్వ్యర్థి కావ్యాలు. మూడర్థాలు వచ్చేవి త్ర్యర్థి కావ్యాలు. నాలుగర్థాలు వచ్చేవి చతురర్థి కావ్యాలు. వీటిలో ద్వ్యర్థి కావ్యాలే తెలుగులో ఎక్కువగా వచ్చాయి. ద్వ్యర్థికావ్యంలో రెండర్థాలు సమాంతరంగా కావ్యమంతటా ఉంటాయి.

ద్వ్యర్థి కావ్యం చాలా విలక్షణమైన, కష్టభరితమైన ప్రక్రియ. ఒకే కావ్యానికి రెండు అర్థాలు వచ్చేలా రచిస్తే దాన్ని ద్వ్యర్థి కావ్యమని పిలుస్తారు. రాఘవ పాండవీయమనే గ్రంథాన్ని ఉదాహరణగా స్వీకరిస్తే అవే పద్యాలు రామాయణ పరంగా చదువుకుంటే రామాయణంగానూ, మహాభారతంగా అర్థం చేసుకుంటే భారతంగానూ అర్థం వచ్చేలా రచించారు. ఇలాంటి గ్రంథాన్ని రచించడానికి విస్తృతమైన భాషా పరిజ్ఞానం, లోతైన సాహిత్య పాండిత్యం అవసరం.

ద్వ్యర్థి కావ్యాన్ని మొదట వేములవాడ భీమకవి వ్రాశాడని ప్రతీతి. అయితే ఆ కావ్యం లభించడంలేదు. ఆయన 11వ శతాబ్ది వాడు కాగా ఆయన అనంతరం 16వ శతాబ్ది వరకూ ద్వ్యర్థి కావ్యాలు రాలేదు. ప్రస్తుతానికి లభిస్తున్న ద్వ్యర్థి కావ్యాన్ని రచించినవారు పింగళి సూరన. పింగళి సూరన వ్రాసిన రాఘవ పాండవీయం తొలి తెలుగు ద్వ్యర్థి కావ్యంగా నిలుస్తోంది. సూరన కావ్యం తర్వాత రామరాజభూషణుడు, కృష్ణాధ్వరి వంటివారు రచించారు. దక్షిణాంధ్రయుగంలో ద్వ్యర్థి కావ్యాలు విలసిల్లాయి. ఆధునిక యుగంలో కూడా పలు ద్వ్యర్థి కావ్యాలు వచ్చాయి.

## పఠనపద్ధతి:

పింగళి సూరన రాఘవపాండవీయంలో అనేకార్థ కావ్యాలను చదివే పద్దతి ప్రత్యేకంగా వివరించాడు.

ఒక కథ వినియెడు తరి వే
రొక కథపై దృష్టి యిడిన నొక యర్థము తో
పక పోవు గాన నేకా
ర్థ కావ్య మెట్లట్ల వినగదగు నొకటొకటిన్

ఒక కథను చదివేటప్పుడు వేరొకకథపై దృష్టి వుంచితే ఏ ఒక్క అర్థమూ స్పష్టం కాదు. అందుకని ఏకార్థకావ్యం లాగా చదవాలి. అంటే ముందు ఒక కథను దృష్టిలో ఉంచుకుని పద్యం మొత్తం అన్వయించుకోవాలి. తర్వాత రెండో కథను దృష్టిలో ఉంచుకుని దానికి తగ్గట్టు అన్వయించుకోవాలి.

## తెలుగులో ప్రఖ్యాత ద్వ్యర్థి కావ్యాలు

- రాఘవ పాండవీయం
- అచలాత్మజా పరిణయం

# ఓ మంచి పద్యం

## పద్యం:

కారే రాజులు? రాజ్యముల్ కలుగవే? గర్వోన్నతిన్ బొందరే? వా
రేరీ? సిరి మూట కట్టుకొని పోవంజాలిరే? భూమిపై
పేరైనం గలదే? శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై
ఈరే కోర్కెలు? వారలన్ మరచిరే ఇక్కాలమున్ భార్గవా!

ఇది పోతన గారి వామనావతార ఘట్టంలోని పద్యం. వామనుడు విష్ణువుని, బలిని నాశనం చెయ్యటానికే వచ్చాడని గ్రహించిన శుక్రుడు వామనుడికి దానం ఇవ్వొద్దని బలిని హెచ్చరించినప్పుడు అతనన్న మాటలు ఇవి.

## భావం:

"భర్గుని కమారుడైన శుక్రాచార్యా! పూర్వం కూడ ఎందరో రాజులు ఉన్నారు కదా. వారికి రాజ్యాలు ఉన్నాయి కదా. వాళ్ళు ఎంతో అహంకారంతో ఎంతో విర్రవీగినవారే కదా. కాని వా రెవరు సంపదలు మూటగట్టుకొని పోలేదు కదా. కనీసం ప్రపంచంలో వారి పేరైనా మిగిలి లేదు కదా. శిబి చక్రవర్తివంటి వారు కీర్తికోసం సంతోషంగా అడిగినవారి కోరికలు తీర్చారు కదా. వారిని ఈ నాటికీ లోకం మరువలేదు కదా."

వామనునికి దానం ఇవ్వద్దు అన్న శుక్రాచార్యులకు సమాధానం చెప్పే సందర్భంలో బలి చక్రవర్తిచే పోతన పలికించిన జగత్రసిద్ధ మైన పద్య మిది.



# పదవినోదం

| | | | | |
|---|---|---|---|---|
| 1. | 2. | 3. | | 4. |
| 5. | | 6. | 7. | |
| 8. | 9. | | | |
| | 10. | | 11. | |
| | 12. | | | |

**అడ్డం:**

1. ద్వీపాల పండుగ(4)
2. నయనం(2)
3. ఏడాది(3)
5. వృశ్చికం(2)
6. కట్టెలు కోసేది(2)
8. నాలుక పసిగట్టేది(2)
9. దొరుకు(2)
10. రాముని చెప్పండి(2)
11. తిరగబడిన 'తల'(2)
12. కురులను ఇష్టపడే మూర్తి(4)

**నిలువు:**

2. క్షీరం(2)
3. భగవంతుడు భక్తులకు ఇచ్చేది(2)
4. వెలుతురుకు వ్యతిరేకం(3)
5. రథం(2)
7. ఫలం(2)
8. శివుడు(3)
9. పని ఒత్తిడి వల్ల కలిగేది(3)

సమాధానాలు: తదుపరి పత్రికలో

---

ప్రతిభ- ద్వైమాస పత్రిక (జులై. ఆగస్టు) సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1. రా | ము | డు | 2. క | న్ను |
| 3.వ | త్స | రం | ళా | 4.గ |
| ణు | 5.ఉ | రి | శా | ణ |
| డు | 6.పా | 7.ము | 8.ల | ప |
| 9.గా | యం | క్కు | క్ష | తి |

# కళాశాల వార్తా కదంబం




## వివేకానంద కాలేజీ అధ్యాపకులకు సన్మానం



**నవతెలంగాణ-హైదరాబాద్**

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హైదరాబాద్ ఉడాన్ లయన్స్ క్లబ్ సభ్యులు, కళాశాలలో ఏర్పాటు చేసిన లియో క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులందరినీ శాలువా కప్పి, పూల మొక్కలతో సత్కరించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య మాట్లాడుతూ గురువు గొప్పతనాన్ని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ అనితా అబ్రహం మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకులందరూ తమ ఇష్ట పూర్వకంగా అధ్యాపక వృత్తికి వచ్చిన వారే కానీ, అవకాశం వల్ల ఈ వృత్తికి వచ్చిన వారు కాదన్నారు. మల్టిపుల్ లియో చైర్మెన్ కె.గోవిందరాజు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల స్థానం ఎల్లప్పుడూ ఉన్నతమైనదేనని తెలుపుతూ, రాష్ట్రంలోని 128 ప్రభుత్వ కళాశాలలలో లియో క్లబ్ లను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డి.పి.పద్మావతి మాట్లాడుతూ కళాశాల అధ్యాపకులను, విద్యార్థులను ప్రశంసించారు. ఈ కళాశాల అధ్యాపకులు మంచి క్వాలిఫికేషన్స్‌తో పాటు సుదీర్ఘ బోధనానుభవం కలిగియున్నారని తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణకు ముచ్చట పడ్డారు. కళాశాలలోని వసతులను చూసి, ఏ ప్రైవేటు కళాశాలకు తీసిపోదని అభివర్ణించారు. కళాశాల లియో క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్న బాబు ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కళాశాలలోని ప్రధానాచార్యులు మొదలుకొని, అధ్యాపకులొక్కొక్కరిని పిలిచి సత్కరించారు. అధ్యాపకులు లయన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.




లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మన కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమ చిత్రావళి









**తెలంగాణ భాషా దినోత్సవం** – 9/9/2022 నాడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారిచే కాళోజీ స్మారకోపన్యాసం, ప్రతిభ పత్రిక ఆవిష్కరణ




కళాశాల తెలుగు శాఖ వివిధ సాహిత్య అంశాలను విద్యార్థులకు పరిచయం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ భాషా దినోత్సవం – 9/9/2022 నాడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారిచే **ప్రతిభ ద్వైమాసిక పత్రిక** ప్రారంభించింది. ఇందులో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే 'విద్యార్థుల రచనలు' కూడా పొందుపరచబడ్డాయి. పోటీ పరీక్షల్లో తెలుగు నుండి వచ్చే ముఖ్యమైన ప్రశ్నలను పరిచయం చేయడం ఈ పత్రిక ప్రత్యేకత.







తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే, ప్రకృతిని పూజించే పండుగగా ప్రసిద్ధి చెందిన **బతుకమ్మ పండుగ** వేడుకలు 27/9/2022 నాడు మన కళాశాలలో అంగరంగ వైభవంగా జరిగాయి.







ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జరుపుకునే ఏక్తా దినోత్సవం కార్యక్రమంలో భాగంగా 31/10/2022 నాడు మన కళాశాలలో NSS ఆధ్వర్యంలో ర్యాలి.

## పీజీ ఎంట్రన్స్‌లో అభిలాష్‌కు మొదటి ర్యాంకు



**నవతెలంగాణ–హైదరాబాద్**

విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివిన విద్యార్థి ఎం.అభిలాష్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీజీ తెలుగు ఎంట్రన్స్ టెస్ట్‌లో మొదటి ర్యాంకు సాధించాడు. తమ కాలేజీలో చదివిన విద్యార్థి మొదటి ర్యాంకు సాధించడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్యతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ జె.భారతి మాట్లాడుతూ అభిలాష్ తెలుగు ఎంట్రన్స్ టెస్ట్‌లో యూనివర్సిటీ మొదటి ర్యాంకు సాధించడం కళాశాల చరిత్రలోనే మొదటి సారి అన్నారు. అభిలాష్ తెలివైన విద్యార్థి అని తెలిపారు. ఇంతకు ముందు తెలుగు వికీపీడియాలో 30 రోజుల్లో వంద వ్యాసాలు రాసి, తెలుగు వికీపీడియా బ్రాండ్ అంబాసిడర్‌గా రికార్డు నెలకొల్పాడని తెలిపార. అభిలాష్‌కు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ గతేడాది డిసెంబర్ 19న జ్ఞాపికను అందజేసి ప్రశంసించినట్టు తెలిపారు.

ఎం.అభిలాష్ ఎంఏ తెలుగులో చేరుటకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంకు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో నాల్గో ర్యాంకు, హైదారాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో మూడో ర్యాంకు సాధించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరినందుకు గాను కళాశాల తెలుగు శాఖ, ప్రధానాచార్యుల అభినందనలు అందుకున్నాడు.

# కాకతీయ కళాతోరణం



కాకతీయ కళా వైభవానికి చిహ్నంగా నిలిచే కాకతీయ కళాతోరణం 12వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తులచే నిర్మించబడిన రాతి ద్వారం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నంగా పరిగణించబడుతున్న ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం ఓరుగల్లు ద్వారంగా పిలువబడుతుంది. చరిత్రలో ఏకశిలా నగరంగా, ఓరుగల్లుగా పిలువబడిన వరంగల్లులో ఈ చారిత్రాత్మక కట్టడం కనిపిస్తుంది. దీనిని కాకతీయ కీర్తి తోరణంగా కూడా పిలుస్తారు.